

"రండి, శాంతమ్మగారూ! మీ కోసమే ఎదురు చూస్తున్నాం!" సాదరంగా ఆహ్వానించింది లక్ష్మి.

లక్ష్మి కొడుకుకు ఆరోజు అన్నప్రాశన. అది శాంతమ్మగారి చేతులమీదుగా జరగాలని లక్ష్మి కోరిక.

"అయ్యో, నేను ఆలస్యం చేశాను కదూ! తీరా బయలుదేరే సమయానికి కరణంగారు ముఖ్యమైన పనిమీద వెళ్తున్నాను, ఎదురు రమ్మంటే ఆలస్యం అయింది!" నొచ్చుకుంటూ అన్నారు శాంతమ్మగారు.

"ఫరవాలేదులెండి!" అంటూనే బొట్టు పెట్టి, కాళ్లకు పసుపు రాసి కొడుకును శాంతమ్మ ఒళ్లో కూర్చోబెట్టింది లక్ష్మి. బాబును ముద్దాడి, నోట్లో పాయసం పెట్టి, "వివేక్!" అని పిలుస్తూ తను స్వయంగా కుట్టి తెచ్చిన జుబ్బా బాబుకు తొడిగి లక్ష్మి చేతికి అందించారు.

"ఇంక వస్తానమ్మా, లక్ష్మి! రేపు విజయ కూతురు పుట్టినరోజు. కొంచెం స్వీట్లూ, హాట్లూ చేయాలి!" పండూ, తాంబూలం అందుకుని బయలుదేరింది.

శాంతమ్మగారు ఎవరో, ఏమిటో ఆ ఊళ్లో ఎవరికీ తెలియదనే చెప్పాలి. దాదాపుగా ఆరు సంవత్సరాల క్రితం అనుకుంటా ఆ గ్రామంలో చిన్న సూట్‌కేస్‌తో అడుగుపెట్టి వారం తిరక్కుండానే అందరి తల్లో నాలికలా అయ్యారు. చూడగానే గౌరవం కలిగేటట్లుగా నుదుట పెద్ద బొట్టు, కాళ్లకు పసుపు, మెళ్లో నల్లపూసలు, చిన్న ముడి, మొహంమీద చెరగని చిరునవ్వు ... శాంతమ్మ పేరును సార్థకం చేస్తూ ఎప్పుడూ శాంతంగా పేరుకు స్ఫూర్తినిచ్చిన శాంతమ్మంటే అందరికీ గౌరవం.

మొదట్లో ఊళ్లో అమ్మలక్కలు శాంతమ్మ గురించి రకరకాల ఊహాగానాలు చేశారు. ఎవరన్నా ఆవిడను వివరాలు అడిగితే, సున్నితంగా మాట మార్చి, "అది అంత అవసరమా?" అని నవ్వుతూ అనేసరికి ఆవిడను అడిగే సాహసం మరి ఎవరూ చేయలేదు. అందరికీ 'నేను ఉన్నాను' అని సాయపడే మనస్తత్వం వల్ల ఆవిడ గురించి చాటుగా కూడా ఎవరూ చర్చించుకునే అవకాశం రాలేదు.

ఉదయాన్నే లేచి పెరట్లో పూలూ, పత్రీ కోసి చిన్నచిన్న ప్లాస్టిక్ కవర్స్‌లో వేసి పూజలు చేసే వాళ్లందరికీ అందజేయడంతో శాంతమ్మగారి దినచర్య మొదలవుతుంది. అన్నిరకాల తెలుగు పేపర్లు చదవడం ఆవిడ హాబీ. జిల్లా గ్రంథాలయంలో కూర్చుని అన్నీ చదివి పిల్లలకూ, పెద్దలకూ చెబుతూ ఉంటారు. ఆవిధంగా నిరుద్యోగ యువత అందరూ ఆవిడకు చేరువయ్యారు. చిన్నపిల్లలతో వంట అవక

# ఇది తప్పా?!

సీతా సత్య

సతమతమయ్యే గృహిణులకు వంటపనిలో సాయం చేస్తూ, వంటల్లో తేలిక పద్ధతులు వివరిస్తూ గృహిణులకు దగ్గరయ్యారు. సాయంకాలంపూట చిన్నపిల్లలందరినీ చేరదీసి రకరకాల ఆటలు వాళ్లకు నేర్పిస్తూ పిల్లలందరితో 'అమ్మమ్మ' అని పిలిపించుకుని పిల్లలకు చేరిక అయ్యారు.

ఏ కార్యం జరిగినా అది శాంతమ్మ చేతులమీదుగా జరగడం ఆ గ్రామంలో ఆనవాయితీగా మారింది.

విజయ కూతురు పుట్టినరోజు బాగా జరిగింది. అందరూ శాంతమ్మగారి వంటలను మెచ్చుకుంటూ వెళ్లారు. ఆ రాత్రి పడుకున్న శాంతమ్మ మరి లేవలేదు! అలుపు ఎరుగని శాంతమ్మ... విశ్రాంతి అంటే ఏమిటో తెలియని శాంతమ్మ ... 'శాశ్వత విశ్రాంతి' తీసుకున్నారు.

ఊరూ ఊరంతా తమ ఇంట్లో మనిషిని కోల్పోయినట్లుగా రోదించారు. ఎప్పుడూ నలత ఎరుగని శాంతమ్మ సడెన్‌గా ఎందుకిట్లా అయిందో తెలియదు.

ఆరోజు పొద్దుటే 'పూజకు పువ్వులు ఎందుకు తేలేదో' అనుకుంటూ కరణంగారు పాలేరుని శాంతమ్మగారి ఇంటికి పంపించారు. ఎంత పిలిచినా పలకడంలేదని పాలేరు చెబితే, భార్యను వెంటతీసుకుని కంగారుగా బయలుదేరి వెళ్లారు. ఆవిడ పడుకున్న తీరు ఆదమరిచి ప్రశాంతంగా నిద్రపోతున్నట్లుగా ఉంది. కరణంగారి భార్య "శాంతమ్మగారూ!" అంటూ పిలుస్తూ ఒంటిమీద చెయ్యి వేసి కెవ్వుమంటూ వెనక్కు తీశారు. అప్పటికే ఆవిడ శరీరం చల్లగా కొయ్యముక్కలా అయిపోయింది. ఊళ్లో పెద్దలందరూ చేరి ఏం చెయ్యాలో చర్చలు మొదలుపెట్టారు.

"మనమే దహన క్రియలు కానిద్దాం!" ప్రెసిడెంటుగారు అన్నారు.

"అవును. మన అందరిమధ్యా కలిసిపోయిన శాంతమ్మగారికి అన్నీ మనమే చేద్దాం!" దుఃఖంతో కరణంగారి గొంతు పూడుకుపోయింది.

"పెదనాన్నగారూ! శాంతమ్మగారు చాలాసార్లు ఏదో రాస్తూ కనిపించేవారు. ఆవిడ పెట్టెలో ఏమన్నా వివరాలు ఉన్నాయేమో చూస్తే బాగుంటుందేమో!" ప్రెసిడెంటుగారి తమ్ముడి కొడుకు రాజు అన్నాడు.

రాజును ఎంకరేజ్ చేసి మెడిసిన్‌లో రాంక్ వచ్చేటట్లుగా శాంతమ్మగారు చేసిన ప్రయత్నం ఫలించి రాజు రాంక్ తెచ్చుకున్నాడు.

"సరే, అట్లాగే కానిద్దాం! రాజూ! నీవే ఆ పెట్టె తీసి చూడు!" ప్రెసిడెంట్‌గారు ఆదేశించారు.

రాజు పెట్టె తెరిచి అందులో ఒక్కొక్క వస్తువూ జాగ్రత్తగా బయటకు తీశాడు. మొదటగా చిన్న కవరుమీద 'నా అంత్యక్రియలకు' అని ఉంది. అది తీసి కరణంగారి చేతికి అందించాడు.

అందులో రెండు వేల రూపాయలు, చిన్న ఉత్తరం ఉన్నాయి. పెట్టెలో చివరగా పెద్ద కవరు ఒకటి ఉంది. ఆ కవరుమీద 'ఊరి పెద్దలకు' అని రాసి ఉంది.

"ఏదీ, ఆ ఉత్తరం చదువు!" కరణంగారు రాజుతో అన్నారు.

"పూజ్యులైన ఊరి పెద్దలకు శాంతమ్మ నమస్కరించి రాయునది. ఏదో ఒరోజు దీని అవసరం వస్తుందని రాసిపెట్టాను. ఈ ఊరి ప్రజలందరూ చూపించిన అభిమానానికి జన్మజన్మలకూ కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను.

"నేనెవరో తెలియకుండా, మీలో ఒకరిగా నన్ను చూసినందుకు ఇంకో జన్మంటూ ఉంటే ఇదే గ్రామంలో పుట్టాలని కోరుకుంటున్నాను. నేను చేసింది తప్పో, ఒప్పో తెలియదు. నా మనసుకు నచ్చిన పని నేను చేశాను. నేను చేసింది తప్పు అనిపిస్తే నేను చెప్పిన అడ్రస్‌కి వెళ్లవద్దు. ఫరవాలేదు, మంచిపనే చేసింది అనిపిస్తే ఆ ఊరు వెళ్లండి.

"నేను చాలా పెద్ద కుటుంబంలో పుట్టాను. మావారు శ్రీ రామారావుగారు ఎనిమిది సంవత్సరాల క్రితం హఠాత్తుగా హార్ట్ ఎటాక్ వచ్చి పోయారు. మాకు సంతానం కలగలేదు. ఆస్తులు చాలా ఉన్నాయి. సంతానం లేదన్న బాధ మా ఇద్దరికీ ఎప్పుడూ లేదు. నాకు ఆయనా, ఆయన నాకు పసిపిల్లలం. అదీకాక మా బంధువుల పిల్లలు ఎక్కువగా మా ఇంట్లోనే ఉండేవారు. అందరినీ ప్రేమగా చూడడం వల్ల బాగా చేరేవారు. ఆయన సడెన్‌గా కాలం చెయ్యడంవల్ల నాకు అంతా అయోమయంగా తయారైంది. ఆయన అన్నదమ్ములు ముగ్గురు, అక్కగారు ఉన్నారు. అందరికీ నేనంటే చాలా గౌరవం. మా మరిది పిల్లలు 'పెద్దమ్మా, పెద్దమ్మా' అంటూ చుట్టూ చేరేవారు. నేను మామూలు మనిషిని కావడానికి దాదాపుగా సంవత్సరం పట్టింది. అప్పటివరకూ మా ఆడపడుచు అన్నీ పట్టించుకుని నన్ను జాగ్రత్తగా చూసేవారు.

మొదటిసారిగా నేను షాక్ తిన్నది ఎక్కడంటే, మా మరిది కూతురు ఉషకు పెళ్లి నిశ్చయం అయింది. ఆరోజు నిశ్చితార్థం. అప్పటికి నేను తిరగడం మొదలుపెట్టి నెల కావస్తోంది. ఆరోజు అందరితోపాటు లేచి వంటగదిలోకి వెళ్లాను. అక్కడ మా తోటికోడలు సుశీల వంటపనితో సతమతమవుతోంది. నేను సాయం చేయబోయాను. 'వద్దులే, అక్కా! నీవు నీ గదిలో విశ్రాంతి తీసుకో!' సున్నితంగా చెప్పింది. 'నాకేమీ అనారోగ్యంగా లేదు సుశీలా! నన్నూ చెయ్యనీ!' చొరవగా గరిట అందుకున్నాను. 'అది కాదక్కా! ఈ పాయసం దేముడి దగ్గరకు. అది నేనే చెయ్యాలని అమ్మ చెప్పింది' అంటూ వేరే గరిట తీసుకుంది. అంటే ... నేను దేవుడి దగ్గర పాయసం చెయ్యకూడదన్న మాట!

బయటకు వచ్చేసరికి మా తోటికోడలు తల్లి అంటోంది "ఉషకు ఎవరన్నా కుంకుళ్లు నానబెట్టండర్రా!" వెంటనే నేను వెళ్లి కుంకుళ్లు నానబెట్టాను. "అయ్యో, నీకెందుకు శాంతీ ... ఈ పనులన్నీ ... వెళ్లి నీ గదిలో కూర్చోలేకపోయావా?" నావైపు అదోలా చూస్తూ అన్నారు. నాకు అర్థం కాలేదు. "మీరందరూ పనులు చేసుకుంటుంటే నేను ఎలా కూర్చోను?" అంటూ ఉషకి నలుగుపెట్టడానికి తయారయ్యాను.

అంతే! ఆవిడ దాదాపుగా నన్ను గెంటినంత పని చేసి, "నీకెందుకు, శాంతీ ఈ పనులన్నీ? వెళ్లి నీ గదిలో కూర్చో!" విసురుగా అన్నారు. నా మనసు చివుక్కుమంది. రెండు సంవత్సరాల క్రితం ఉష అక్క హారిణి పెళ్లికి అన్నీ నా చేతులమీదుగా జరిగాయి. అందరి నోళ్లలోనూ నేనే ఉండేదాన్ని. అప్పుడు అన్నిటికీ పనికివచ్చినదాన్ని ఇప్పుడు ఎందులోనూ చేతులు పెట్టడానికి పనికిరాకుండా పోయాను. బాత్‌రూమ్‌లో నేను నానబెట్టిన కుంకుళ్లు పక్కనపెట్టి, వేరే కుంకుళ్లతో ఉషకు స్నానం చేయించారు. ఆ అవమానం తట్టుకోవడం నావల్ల కాలేదు. సంవత్సరం నుండీ ఏడ్చింది ఆయన దూరం అయ్యారన్న బాధతో. కానీ ఆ రోజు ఏడ్చింది ఆయన దూరం అవడమే కాదు, చాలా వేడుకలకు దూరం చేశారని కుమిలి కుమిలి ఏడ్చాను. ఆరోజు ఎవరూ నన్ను పట్టించుకోలేదు. కనీసం ఉష ఎలా ఉందో చూద్దామన్నా నా దగ్గరకు రానివ్వలేదు. పెళ్లివారు రావడం, సందడీ అన్నీ వినిపిస్తున్నాయి. అక్షింతలు వెయ్యమని పిలుస్తారేమో అని లేచి మొహం కడుక్కుని మంచి చీర కట్టుకున్నాను. నన్ను ఎవరూ పిలవలేదు.

దాదాపుగా మధ్యాహ్నం మూడుగంటలు అవుతుండగా నేను గుర్తుకు వచ్చాను. అప్పటికే పెళ్లివాళ్లు వెళ్లిపోయారు. "భోజనం చెయ్యి, శాంతక్కా!" మా చిన్న తోటికోడలు వచ్చి అడిగింది. మనసులో బాధ దిగమింగుకుంటూ భోజనం అయిందనిపించాను. "పెళ్లికొడుకును చూశావా, శాంతీ!" మా తోటికోడలు తల్లి అడిగారు. "ఆఁ.." అని చెప్పి లోపలకు నడిచాను. అందరూ సందడిగా పెళ్లివాళ్ల కబుర్లు చెప్పుకుంటుంటే

నేనుమాత్రం ఒంటరిగా నా గదిలో కూర్చున్నాను.

నాకు పూజలమీద ఇంటరెస్ట్ పోయింది. 'ఎవరికోసం పూజ చెయ్యాలి?' అని నాలో నిర్లిప్తత చోసుచేసుకుంది. చిన్నప్పుడు పూజ అంటే కాళ్లకు పసుపు రాసుకుని, ఆ పచ్చటి కాళ్లవైపు మురిసిపోతూ చూసుకునేదాన్ని. అదే అలవాటుగా రోజు కాళ్లకు పసుపు రాసుకుని మట్టెలు, పిల్లేళ్లుతో ఉన్న కాళ్లను ఆనందంగా చూసుకుంటుంటే మావారు నవ్వేవారు "నీకు ఇదేం పిచ్చి శాంతీ! ఆడవాళ్లు మొహాన్ని పదే పదే అద్దంలో చూసుకుంటారు. నీవు నీ కాళ్లను పదే పదే చూసుకుంటావు!" అని వెక్కిరించేవారు.

నాకు ఇష్టమైనవాటిల్లో ఇంకొకటి ఎవరన్నా అతిథులు ఇంటికి వస్తే, బొట్టుపెట్టి పండు, జాకెట్ పీస్ ఇవ్వడం. ఎందుకో అలా ఇవ్వడం నాకు చాలా ఇష్టం. దానికీ దూరమయ్యాను. ఎవరన్నా వచ్చినా నేను బొట్టు పెట్టకూడదు కదా! ఎవరినన్నా పిలిచి వాళ్లతో బొట్టు పెట్టించేదాన్ని. ఒక మనిషి దూరం అవడం ఏంత బాధాకరమైన విషయమో అంతకన్నా రెట్టింపు బాధ ఇష్టమైన పనులన్నీ బలవంతంగా దూరం చేసుకోవడం.

ఆరోగ్యం బాగానే ఉంది. ఇలా ఎందుకూ పనికిరాకుండా మూల కూర్చుంటే పిచ్చి ఎక్కేటట్లుగా ఉంది. నాకు చాలా ఆస్తి ఉంది. ఒక నిర్ణయానికి వచ్చి, మా మరుదులతో చెప్పాను "నాకు ఏదన్నా వృద్ధాశ్రమంలాంటిది పెట్టాలని ఉంది. మన పొలం గట్టుమీద ఉన్న చావిడిలో గదులుగా ఏర్పాటు చేయించండి, పది మంచాలతో ప్రారంభించాలనుకుంటున్నాను!" అని.

"నీకు చాలా శ్రమ అవుతుందేమో వదినా, చెయ్యగలవా?" అన్నాడు మరిది.

"ఫరవాలేదు, చెయ్యగలను. నాకు ఇలా కూర్చోబుద్ధి కావడంలేదు. అదీ కాక, మనకు తెలుసున్న ముసలివాళ్లు చాలామంది ఉన్నారు. ఏ ఆధారం లేనివాళ్లూ ఉన్నారు. మొదట పదిమందితో ప్రారంభించాలని ఉంది!" చెప్పాను.

మూడు నెలలు తిరగకుండా అనుకున్న పని మొదలుపెట్టాను. వంటకు మనిషిని పెట్టుకున్నాను. ఎనిమిదిమంది చేరారు. ఎవరి ఆరోగ్యానికి తగ్గట్లుగా వాళ్లకు భోజనం పెట్టేదాన్ని. వాళ్లతో రోజులు చాలా బాగా గడిచాయి. నేను అన్నీ మరిచి కొంచెం సంతోషంగా ఉంటున్నాను. ఒకరోజు మా దూరపు బంధువులు ఆశ్రమంలో ఉన్నవాళ్ల తాలూకు మామ్మగారిని చూడటానికి వచ్చారు. వచ్చినవాళ్లతో ఆ మామ్మగారు అంటున్నారు "ఇక్కడ అంతా బాగుంది. ఇక్కడకు వచ్చాక నా ఆరోగ్యం బాగుపడింది. కానీ పొద్దుటె లేచి ఆ శాంతి మొహం చూడాల్సి వస్తోంది. అది ఒకటే బాధగా ఉంది!"

నా చెవిన బాంబుల్లాంటి ఆ మాటలు పడిన తరువాత నాకు చాలా బాధ అనిపించింది. అంటే ... కల్మషం లేకుండా నేను అందిస్తున్న సేవలు వీళ్లకు కావాలి. కానీ, నా మొహంమాత్రం పొద్దుటే చూడకూడదన్నమాట! అందుకే కాబోలు నేను పొద్దుటే లేపుతుంటే, "లేస్తానులేమ్మా!" అంటూ బలవంతంగా కళ్లుమూస్కునేవారు.

మళ్లీ నా మీద నాకు విరక్తి మొదలయింది. బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను. నా చివరి జీవితం నా ఇష్టమొచ్చినట్లుగా గడపాలి అని దృఢంగా అనుకుని, అనుకున్నదే తడవుగా అమలుపెట్టాను. నా దగ్గర వంటచేసే మనిషికి ఆశ్రమం అప్పగించి జాగ్రత్తగా చూసుకోమని చెప్పి, మా మరుదులతో తీర్థయాత్రలు చేస్తాను అని చెప్పాను. "అదేమిటి వదినా, ఒక్కదానివీ బయలుదేరతావా? సమ్మర్‌లో అందరం కలిసి వెళ్దాం!" అన్నాడు మా చిన్న మరిది.

"ఫరవాలేదులేవయ్యా, నాకు ఇప్పుడే తిరగాలని ఉంది!" సున్నితంగా చెప్పి బయలుదేరాను. నాలో ఒకవిధమైన మొండితనం, ఉక్రోషం చోటుచేసుకున్నాయి, బొట్టు ఉండటానికి లేకపోవడానికి తేడాను అనుభవించిన నేను బతికినంతకాలమూ ముత్తయిదువుగా బతకాలి అని దృఢంగా నిశ్చయించుకున్నాను. నేను ఎవరో ఏమిటో తెలియనివాళ్ల మధ్య కళకళలాడుతూ బతకాలి అనుకున్నాను. మొదటగా విజయవాడ స్టేషన్‌లో దిగి ఫస్ట్‌క్లాస్ టికెట్ తీసుకుని వెయిటింగ్ రూమ్‌లో నాకు ఇష్టమైన రీతిలో నా అలంకరణ మార్చుకున్నాను. అలా చేసుకునేటప్పుడు ఒకవిధమైన భయం, సిగ్గు అనిపించింది. కాళ్లకు పచ్చగా పసుపు రాసుకుని మట్టెలు పెట్టుకున్నాను. బోసిపోయిన నుదిటిమీద పావలా కాసంత బొట్టు పెట్టుకుని, మెళ్లో నల్లపూసలు వేసుకుని, నాకు ఇష్టమైన ముదురురంగు చీర కట్టుకుని అద్దంలో చూసుకుని ఒక్కసారి భోరుమని తనివితీరా ఏడ్చి బయటపడ్డాను. అదృష్టవశాత్తు నేను ఎత్తుకున్న ఈ గ్రామం మారుమూల ఉండటంవల్ల నేను ఎవరికీ తెలిసే ప్రమాదం లేదు. మిమ్మల్నందరినీ మోసం చేస్తున్నానన్న భావం మొదట్లో ఉండేది. మొదట్లో శుభకార్యాలలో వేలు పెట్టడానికి జంకుగా ఉండేది. కానీ నేను జంకుగా మొదలుపెట్టినా ఎక్కడా ఏ ఆటంకం కలగకపోవడం వల్ల నాలో ఆత్మవిశ్వాసం రెట్టింపు అయింది. మీకు నా మీద నిజంగా అభిమానం ఉంటే అర్థంలేని ఆచారాలతో ఎవరి మనసూ నొప్పించవద్దు. ఎవరికి నచ్చిన రీతిలో వారిని జీవించనివ్వండి! ఎవరికన్నా చెడు జరిగితే కేవలం అది వాళ్ల దురదృష్టం కానీ, అనాచారం మాత్రం కాదు!

మంచి మనసుతో చేసే ఏ పని అయినా మంచిగానే ఉంటుంది. అందుకు నా జీవితమే ఉదాహరణ. దాదాపుగా ఆరు సంవత్సరాలనుండి మీ గ్రామంలో ప్రతి శుభకార్యం నా చేతులమీదుగా జరిగాయి. ఎవరికీ ఏ అపకారం జరగలేదు కదా!

నేను బతికి ఉండగానే ఈ గ్రామంలో పాఠశాల కట్టించాలనుకున్నాను. మా ఊరు వెళ్లి ఆస్తులు అమ్మాలి కదా! అప్పుడు మీ అందరికీ నా గురించి తెలిసి నాకు ఇంతక్రితం ఇచ్చిన గౌరవం ఇస్తారో, లేదో అని భయపడి ఆ పని చెయ్యలేదు. నా ఆస్తి అమ్మి పాఠశాల కట్టించి మన గ్రామంలో నిరుద్యోగం, నిరక్షరాస్యత లేకుండా చేయాలని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మీ శాంతమ్మ."

చదవడం ముగించిన రాజు వెక్కివెక్కి ఏడ్చాడు. విన్న అందరికీ కళ్లల్లో నీరు.

శాంతమ్మగారి ఆస్తి వివరాలు చూసిన తరువాత అందరికీ ఆశ్చర్యం. ఇంత ఆస్తి ఉన్నావిడ ఎంత సాదా సీదాగా బతికారు! కాలి నడకనే ఊరంతా తిరిగి అందరికీ సాయం చేసేవారు.

శాంతమ్మగారి దహనక్రియలు ఆవిడ కోరినట్లుగా ఏ ఆర్భాటం లేకుండా చేశారు.

ఆ గ్రామంలో సంవత్సరం తిరగకుండా శాంతమ్మగారిపేరుమీద పాఠశాల మొదలయింది. ఆవిడ కోరిక మేరకు భర్త పోయినవాళ్లను అంటరానివాళ్లుగా చూడటం క్రమేపీ తగ్గింది. శాంతమ్మగారు చేసింది తప్పు అని ఎవరూ అనుకోలేదు. ■

